క్లుప్తంగా

వైభవునికి ప్రత్యేక అలంకరణ



అలంకరణకు మల్లెపువ్వులు అందిస్తున్న దాత ప్రసాద్

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైభవ వేంకటేశ్వరస్వామి అలంకరణకు అవసరమైన 1200 మూరలు మల్లెపువ్వుల దండలు హెచ్.ప్రసాద్ అర్చకులకు అందించారు. శ్రీ వారి శేష మాలను కల్యాణ దాతలు, భక్తులకు అందించారు. ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హైటెన్షన్ విద్యుత్ లైన్ల కండక్టర్లు మార్పు



కండక్టర్ మార్చుతున్న సిబ్బంది

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డులో హైటెన్షన్ విద్యుత్ లైన్లలో ఇబ్బందులు తలెత్తకుండా పాత కండక్టర్లు తొలగించి వాటి స్థానంలో కొత్తవి అమర్చుతున్నారు. కనకమ్మ వీధి, గొల్లవీధి ప్రాంతంలో రెండు రోజులుగా కండక్టర్లు మార్పు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కండక్టర్లు చాలా కాలంకిందట వేసినవి కావడంతో బాగా పాడై ఉన్నాయని. వీటివల్ల లీడ్స్ తెగిపోయి వైర్లు కింద పడే ప్రమాదం ఉందని , అటువంటి ప్రమాదాలు తలెత్తకుండా పాత కండక్టర్లు స్థానంలో కొత్తవి వేస్తున్నట్టు సిబ్బంది తెలిపారు.

రహదారులకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 42వ వార్డు పరిధిలో గల పలు ప్రాంతాలలో పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. రైల్వేన్యూకాలనీ, టీఎస్ఎన్ కాలనీ, శివాలయం వీధి, విశ్వతేజ్ స్కూల్ వీధి ఇలా పలు ప్రాంతాలలో గోతులు పడిన రోడ్లు, పాడైన రోడ్లు గత మూడు రోజులుగా బాగుచేస్తున్నారు. వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, జీవీఎంసీ సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ ఎస్ఐబీ)లో జరుగుతున్న మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణ మోహన్ గురువారం ఉదయం తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించడంపై అధికారులను అభినందించారు. అనంతరం ఏయూ సిబ్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పరిశీలించి, అక్కడ ఉన్న పుస్తకాలను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్ ఏడో డాక్టర్ సారాబంది, తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మందుబాబులు



శివనగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద మద్యం సీసాలు



రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆరోగ్య కేంద్రం

- వైద్యాలయాన్ని అడ్డాగా మార్చుకుని వ్యవహారాలు
- రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు

మద్రిపాలెం : పోలీసులు నిఘా ఉన్నా మందుబాబులు రెచ్చిపోతున్నారు. బహిరంగ మద్యపానం నిషేధమైనప్పటికీ అవేవీ పట్టడం లేదు. జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం, శివనగర్‌లో ఉన్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆవరణ రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. చీకటి పడ్డాక ఎవరూ లేని సమయం చూసి దుకాణం తెరిచేస్తున్నారు. ఆరోగ్య కేంద్రం డాబా మీద అలాగే కింద చుట్టూ ఉన్న సందుల్లో విచ్చలవిడిగా తాగి మత్తులో తూలుతున్నారు. నిత్యం తాగి వదిలేసిన మందుసీసాలు, సిగరెట్ ప్యాకెట్లు, కాల్చేసిన గంజాయి, నిరోధ్ ప్యాకెట్లు దర్శనమివ్వడంతో వారు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఆర్అండ్‌బి జంక్షన్ నుంచి ఎఫ్‌సీఐ మీదుగా ఈ కేంద్రానికి ప్రధాన మార్గం, ఈ రహదారి ఆరోగ్య కేంద్రానికి ఆనుకుని ఉంది. రోగుల తాకిడి పెరగడంతో ఉదయం వేళల్లో కొంచెం అలికిడిగా ఉన్నా, ఎదురుగా హిందూ శ్మశానవాటిక ఉండడంతో రాత్రి వేళ ఎవరూ ఇటువైపు రారు. దీనిని అదునుగా చేసుకుని మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

రక్షణ గోడ లేకపోవడంతో ఇబ్బంది..

చుట్టూ రక్షణ గోడ ఉంటే బాగుంటుందని అక్కడ నివసించే ప్రజలు చెప్తున్నారు. అలా లేక పోవడంతో అందరూ ప్రవేశించడానికి వీలుగా ఉంది. దీంతో స్వేచ్ఛగా ఆకతాయిలు లోపలికి ప్రవేశిస్తున్నారు.

సెక్యూరిటీ గార్డ్ అవసరం..

ఈ కేంద్రానికి సెక్యూరిటీ గార్డ్ లేకపోవడంతో ఇబ్బందులు ఉన్నాయి. ఆకతాయిలు నేరుగా వైద్యాలయంలో ప్రవేశిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. సెక్యూరిటీ ఉంటే మందుబాబులను లోపలికి ప్రవేశించకుండా అదుపు చేయవచ్చని చెబుతున్నారు. అధికారులు, పోలీసులు స్పందించి మందుబాబుల ఆగడాలు అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు రోజుల కిందట ఒక వ్యక్తిని ద్విచక్రవాహనంపై వస్తున్న యువకులు ఢీకొనడంతో గాయపడిన సంఘటన ఐదో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చేటుకున్న విషయం తెలిసిందే. గాయపడిన చప్పా దేముడు (45) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ నెల 20న బర్మాక్యాంప్, ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన చప్పా దేముడు తన కుమార్తెతో నడుచుకుంటూ వెళ్తుండగా మురళీనగర్ మసీద్ వద్ద ముగ్గురు యువకులు బైక్‌పై వస్తూ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అయితే కుటుంబ సభ్యులు దగ్గరలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. గురువారం మృతి చెందాడు. కుమార్తె కె.అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవుని కల్యాణ శుభలేఖల పంపిణీ



శుభలేఖల మార్పిడిలో పాల్గొన్న కల్యాణదాతలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల నిర్వహణలో భాగంగా కల్యాణ శుభలేఖల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ మేరకు వైభవుడు, భూదేవీ, శ్రీదేవిల తరుపున కల్యాణ దాతలు శుభలేఖలు ఇచ్చిపుచ్చుకునే కార్యక్రమం సంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. వివరాలను ఆలయం అర్చకుడు శేషాచార్యులు తెలిపారు.

ముగిసిన ముత్యమాంబ అమ్మవారి జాతర



శాకాంబరీ అవతారంలో ముత్యమాంబ అమ్మవారు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం కూడలిలో వెలసిన ముత్యమాంబ అమ్మవారి వార్షిక నవరాత్రి జాతర మహోత్సవాలు గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ముగిశాయి. అమ్మవారిని శాకాంబరీగా అలంకరించారు. వేకువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ముత్యమాంబను దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి వెంకటరావు, భీశెట్టి వీరుబాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 2వేల మందికి అన్నదానం చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ





పి. ఆకాంక్ష 981/1000, ఎస్.వైష్ణవి 981/1000

సీతంపేట: ఇంటర్ మీడియట్ ఫలితాలలో ఫిట్జీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సర ఫలితాలలో కె.మనోజ్ఞ 463/470, బి.ప్రణీత్ 463/470, జి.పార్థవ్ చంద్రాదిత్య 462/470 మార్కులతో కళాశాల టాపర్స్‌గా నిలిచారు. 523 మంది ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సర ఫలితాలలో పి. ఆకాంక్ష 981/1000,ఎస్. వైష్ణవి 981, చిత్రాక్ష్ 978 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. 408 మంది ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఫిట్జీ సెంటర్ హెడ్ పెండేల మస్తాన్‌రావు విద్యార్థులను అభినందించారు.

వైర్లెస్ కాలనీలో డీఆర్ఎం తనిఖీలు



వైర్లెస్ కాలనీలో పర్యటిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం : వసతులు, సదుపాయాలను పరిశీలించేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి గురువారం వైర్లెస్ కాలనీలో ఆకస్మిక పర్యటించారు. రైల్వే కుటుంబాలకు ప్రాథమిక సదుపాయాలైన శానిటేషన్, సెక్యూరిటీ, పర్యావరణం వంటి వాటిని పరిశీలిస్తూ, రైల్వే క్వార్టర్స్ పరిస్థితులను స్వయంగా చూశారు. టైప్–5,6 క్వార్టర్స్ నిర్మాణం చేపట్టనున్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. కాలనీ వాసులతో డీఆర్ఎం ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ పర్యటనలో డీఆర్ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (హెడ్ క్వార్టర్స్) ఎస్కే సారంగి, అధికారులు, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా ఏయూ గ్రంథాలయ సేవలు

- వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- నూతన సాఫ్ట్‌వేర్ సోల్ 3.0 ప్రారంభం



సోల్ 3.0ని ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయ సేవలు మరింత సరళతరం, సులభతరం చేయడం లక్ష్యంగా పని చేస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో గ్రంథాలయంలో వినియోగానికి నూతనంగా అందుబాటులోకి వచ్చిన సోల్ 3.0 వెర్షన్ సాఫ్ట్‌వేర్‌ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు మరింత ఉపయుక్తంగా గ్రంథాలయ సేవలు ఉండే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. యూజర్ ఫ్రెండ్లీగా గ్రంథాలయం మార్పు చేయాలన్నారు. రానున్న రెండు నెలల్లో గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకీకరించి, మెరుగైన సేవలు అందించే దిశగా సిద్ధం చేస్తామన్నారు.

తాళపత్రాల డిజిటలైజేషన్, శోధ్‌గంగలో 8వ స్థానం సాధించడం వర్సిటీ ప్రతిష్టను జాతీయ స్థాయిలో పెంచాయన్నారు.

ఇందుకు కృషి చేసిన గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. చరిత్ర, ఆర్కియాలజీ విభాగాలలో ఉన్న మరికొన్ని తాళపత్రాలను సైతం గ్రంథాలయం తీసుకుని డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. గ్రంథాలయానికి 100 కొత్త కంప్యూటర్లను సైతం అందిస్తామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను అందించిన ఘనత ఏయూ గ్రంథాలయానికి ఉందని, తిరిగి అటువంటి వ్యక్తులను తయారు చేసే దిశగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్‌బాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య జి.శశిభూషణరావు, టి.శోభశ్రీ, వి.విజయలక్ష్మి, ఎస్.కె.భట్టి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటు



ఆచార్య రాజును సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి, ఐఐటీ ఢిల్లీ పూర్వ సంచాలకుడు వి.ఎస్.రాజు గురువారం వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా కార్యాలయంలో భేటీ అయ్యారు. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాలను రెండు వారాల పాటు నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. తాను చదువుకున్న సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో మూడు సంవత్సరాల కాలానికి ఒక చైర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేయాలని వీసీని రాజు కోరారు. విభాగంలో మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలల ఆధునీకీకరణకు సహకారం అందిస్తానన్నారు. అనంతరం సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సత్యనారాయణరెడ్డి, డీఎస్‌టీ పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆర్.ప్రసాదరాజు, ఆచార్య కె.రాజగోపాల్, వై.వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధిపై హర్షం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం(ఆంధ్రప్రదేశ్) ఉపకులపతి ఆచార్య టి.వి.కట్టమణి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఏయూలో గత నాలుగు సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వీసీ వివరించారు. ఏయూలో ప్రగతిపై కట్టమణి హర్షం వ్యక్తం చేశారు.

పైప్‌లైన్ పగిలి.. తాగునీరు వృథా



ఐటీఐ జంక్షన్‌లోని బీఆర్‌టీఎస్ దారిలో పగిలిన పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న తాటిపూడి నీరు



కాలనీల్లో నీరు చేరుతున్న దృశ్యం

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ కూడలి నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్ వెళ్లే బీఆర్‌టీఎస్ సబ్‌వే రహదారిలో గురువారం రాత్రి తాటిపూడి పైప్‌లైన్ పగిలిపోవడంతో మంచినీరు వృథాగా పోతోంది. లీకేజీ నుంచి భారీగా నీరు ప్రవహించడంతో భవానీగార్డెన్, సుంకరపేట సమీప కాలనీలు, రోడ్లు, డ్రైనేజీలు నీట మునిగాయి. బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలో అడుగులోతు నీరు ప్రవహించడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అంధకారంలో శంకరమఠం రోడ్డు



శంకరమఠం రోడ్డులో వీధి దీపాలు వెలగక అలుముకున్న అంధకారం

సీతంపేట : ప్రధాన రహదారుల్లో సైతం వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా మారింది. చీకటి పడితే వీధి దీపాలు వెలగక అంధకారం అలుముకుంటోంది. వాహనాల హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. రాత్రి పది దాటాక వాహనాల రాకపోకలు తగ్గిపోవడంతో చిమ్మ చీకటి అలుముకుంటోంది. జీవీఎంసీ 26వ వార్డు పరిధి శంకరమఠం రోడ్డులో ఐదు రోజులుగా వీధి దీపాలు వెలగక స్థానికులు, వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారులో వీధి దీపాలు వెలగక అంధకారం అలుముకుంటోంది. శంకరమఠం రోడ్డులో శంకరమఠం నుంచి హైవే వరకు రోడ్ మధ్యలో డివైడర్‌పై ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. ఇటీవల శంకరమఠం ప్రాంతంలో ఒక వ్యక్తి చేతిలోని సెల్ ఫోన్‌ను ద్విచక్ర వాహనంపై గుర్తుతెలియని వ్యక్తులు లాక్కొని పారిపోయారు. పోలీసులు వచ్చి విచారించిన చీకటిలో సీసీ కెమెరాలు పనిచెయ్యక వెనుతిరిగారు. ఇటువంటి దొంగతనాలు చోటుచేసుకోవడంతో పరిసరప్రాంతవాసులు భయపడుతున్నారు. దీనికి తోడు వీధి కుక్కలు వెంటపడుతుండటంతో స్థానికులు ఇబ్బందులు రెట్టింపయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాలు వెలిగేలా మరమ్మతులు చెయ్యాలని, వీధి కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

చిరువ్యాపారులకు గొడుగుల పంపిణీ



చిరు వ్యాపారులకు గొడుగులు అందజేస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ చిరువ్యాపా రులకు గొడుగులు అందజేసి మానవత్వం చూపారు. రోడ్డు పక్కన మండుటెండలో కూరలు, పండ్లు, పువ్వులు కొబ్బరి బొండాలు విక్రయించే చిరువ్యాపారుల ఇక్కట్లు చూసి వారికి సాయపడాలని నిర్ణయం తీసుకున్నారు. వేసవిలో నిలువ నీడ లేక ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలో నిలబడి విక్రయాలు చేస్తూ అనారోగ్యం పాలవుతున్న చిరువ్యాపారులకు సాయం చేయాలన్న ఆలోచనతో వారికి నీడను కలిపించేలా జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లతో కూడిన పెద్ద గొడుగులు పంపిణీ చేశారు. వార్డు పరిధిలో రైల్వే న్యూకోలనీ, నందగిరినగర్, 80 అడుగుల రోడ్, జగ్గారావు బ్రిడ్జి, దాలిరాజు సూపర్‌మార్కెట్, చెక్కుడురాయి బిల్డింగ్ ప్రాంతాలలో రోడ్డు పక్కన ఉన్న 50 మంది చిరు వ్యాపారులకు గొడుగులు అందజేశారు. తన స్వంత నిధులతో సుమారు రూ.75వేలు ఖర్చు చేసి వ్యాపారులకు గొడుగులు అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు ఖదిర్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉన్నత ఉపాధి అవకాశాలు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణమూర్తి



పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత ఉపాధి అవకాశాలు పొందవచ్చని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ జీవీవీ సత్యనారాయణమూర్తి అన్నారు. కాలేజీలో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిసెట్‌కు దరఖాస్తు గడువు ఈనెల 30తో ముగిస్తున్నందున్న అందరూ దరఖాస్తు చేయాలని సూచించారు. పాలిటెక్నిక్ విద్య పూర్తి కాగానే క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొని మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. తక్షణ ఉపాధికి పాలిటెక్నిక్‌ను మించిన మార్గం మరొకటి లేదన్నారు. తల్లిదండ్రులు కూడా పాలిటెక్నిక్ విద్యను వారి పిల్లలు అభ్యసించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. కమిషనరు సి.నాగరాణి ఆదేశాల మేరకు ఉచిత కోచింగ్‌తోపాటు ఉచితంగా మెటీరియల్ ఇస్తామన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థుల కన్నా పాలిటెక్నిక్ విద్యార్థులకు కార్పొరేట్ కంపెనీలు ప్రాధాన్యతనిస్తున్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ కేడీవీ నరసింహారావు, పాలిటెక్నిక్ కాలేజీ ప్రతినిధి ఎం.విశ్వనాథరెడ్డి, ప్రముఖ స్పోకెన్ ఇంగ్లిష్ ట్రైనర్ కె.చంద్రశేఖర్, జెట్లీ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారాలు అందజేత



పురస్కారం అందజేస్తున్న అతిథులు

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ రత్న కళా పరిషత్ సంయుక్తంగా స్థానిక పౌరగ్రంథాలయంలో వివిధ రంగాలలో నిష్ణాతులైన ప్రముఖులకు అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారాలు, ఎన్టీఆర్ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. ముందుగా కార్యక్రమాన్ని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, చిత్ర దర్శకులు దివాకర్, వ్యాఖ్యాత రాజేంద్రప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్పొరేటర్ నాగేశ్వరరావు, నేత్ర వైద్యులు నగేష్‌రెడ్డి, ఆయుర్వేద డాక్టర్ కూరపాటి శ్యామ్‌దన్, గాయని మను పల్ల, జన సైనికుడు గుడివాడ రామకృష్ణలతోపాటు మరికొంత మందిని సత్కరించి పుర్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏ.భాస్కర్, హర్షవల్లి, బొమ్మిడి సత్యనారాయణ, సన్యాసిరావు, మోహన్ రావు, చంద్రశేఖర్, రామకృష్ణ, చిన్నారావు, డాక్టర్ ఎం.వరప్రసాద్, అరుణకుమారి, మల్లిక, అడవిరాజు పాల్గొన్నారు.

పెయింటర్ మృతి

మద్రిపాలెం: కంచరపాలెం పరిధిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బర్మాక్యాంప్ ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన ఒనువు అప్పారావు(51) పెయింటింగ్ పనులు చేస్తూ..భార్య ఒనువు కనకమహాలక్ష్మి కేటరింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కనకమహాలక్ష్మి పిల్లలతో కలిసి ఈ నెల 24న నరసన్నపేట వెళ్లింది. గురువారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి తలుపు తీసి చూసేసరికి దర్వాసన వస్తోందిది. భర్త కిందపడి మృతి చెంది ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

అయితే మృతునికి మద్యం సేవించే అలవాటు ఉందని, తాగుడికి బానిసై మృతి చెందాడ లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ షేక్ సమీర్ చెప్పారు.

నేడు, రేపు ప్రార్థనలు

సీతంపేట: జీవీఎంసీ26వ వార్డు మహారాణి పార్లర్ ఎదురుగా 80 అడుగుల రోడ్‌లో ఉన్న గాడ్ మెస్సయ్య సంఘం చర్చిలో శుక్ర,శనివారాల్లో రెండు రోజుల పాటు దైవ ప్రార్థనలు జరుగుతాయని దైవజనులు జి. కామినాయుడు తెలిపారు. ప్రార్థనలలో వివిధ ప్రాంతాలకు చెందిన దైవజనులు పాల్గొని సందేశాలిస్తారన్నారు. పాస్టర్లు, సందేశకులు, ఏసు ఆరాధకులు పాల్గొనాలని కోరారు.